https://epaper.manasamajam.com    Contact No. 9989788438, 9505485656

# మన సమాజం

తెలుగు డిజిటల్ దిన పత్రిక
Truth towards the Society

చైర్మెన్ : పార్వతి సురేష్ కుమార్    ఎడిటర్ : పార్వతి రాజేష్ కుమార్

సంపుటి : 01    సంచిక : 336    ఆదివారం 22-2-2026    పేజీలు : 4

రిపోర్టర్స్ కావలెను

మన సమాజం
Truth towards the Society

మన సమాజం తెలుగు డిజిటల్ దినపత్రికలో
నిఖార్సైన జర్నలిస్టుగా నిలబడాలనుకుంటున్నారా?
అన్ని తరహా వార్తలు, కథనాలు ఎలాంటి ఆంక్షలు లేకుండా
రాయాలని కోరుకుంటున్నారా?
తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, మండలాల్లో
పనిచేసేందుకు విలేఖరులు కావలెను...
మీ కలాలకు పదును పెట్టండి.
సంప్రదించవలసిన నెంబర్లు
9989788438, 9505485656.

## మానవాళికి సమానంగా
# ఏఐ ఫలాలు!

ఆ లక్ష్యంగా కొత్త టెక్నాలజీని వినియోగించుకోవాలి

'న్యూఢిల్లీ ఏఐ సదస్సు' ఉమ్మడి ప్రకటన.. 88 దేశాల ఆమోదం

ప్రపంచ సహకారానికి ఇదొక మైలురాయి: కేంద్రం



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21: 'సర్వజన హితాయ, సర్వజన సుఖాయ' అనే హితోక్తితో మొదలైన 'ఢిల్లీ ఏఐ శిఖరాగ్ర సదస్సు'.. శనివారం ఆఖరి రోజున కూడా అదే స్ఫూర్తిని చాటే ఉమ్మడి ప్రకటనను ఆమోదించింది. కృత్రిమ మేధ (ఏఐ)తో ఒనగూరే ప్రయోజనాల్ని ప్రపంచ మానవాళికి అంతటికీ సమానంగా పంచాలని ఈ ప్రకటన పేర్కొంది. 'ఏఐ ప్రభావంపై న్యూఢిల్లీ డిక్లరేషన్' పేరుతో ఉన్న ఈ ప్రకటనను అమెరికా, బ్రిటన్, చైనా, ఫ్రాన్స్‌లతోపాటు 88 దేశాలు, అంతర్జాతీయ సంస్థలు ఆమోదించాయని విదేశాంగశాఖ తెలిపింది. ఏఐ రంగంలో ప్రపంచ సహకారానికి సంబంధించి ఇదొక మైలురాయి అని వెల్లడించింది. ఆర్థిక ప్రగతి, సామాజిక సంక్షేమం కోసం ఏఐ ఉపయోగపడాలన్న అంతర్జాతీయ ఏకాభిప్రాయానికి నిదర్శనమని పేర్కొంది. కాగా, 'న్యూఢిల్లీ ఏఐ ప్రకటన'ను ఏడు అంశాలు పునాదిగా రూపొందించారు. అవి.. ఏఐ వనరుల ప్రజాస్వామీకరణ, ఆర్థిక ప్రగతి– సామాజిక సంక్షేమం, సురక్షిత విశ్వసనీయమైన ఏఐ, సైన్స్ కోసం ఏఐ, సామాజిక సాధికారత అవకాశాలు, మానవ వనరుల అభివృద్ధి, సమర్థవంతమైన వినూత్నమైన ఏఐ వ్యవస్థలు. ప్రపంచ ఆర్థికాభివృద్ధికి ఏఐ కీలక అంశంగా మారుతుందని, దీర్ఘకాలిక అంతర్జాతీయ ఒప్పందాలకు ప్రేరణగా నిలుస్తుందని 'న్యూఢిల్లీ ఏఐ డిక్లరేషన్' ఆశాభావం వ్యక్తం చేసింది. ఏఐ ఆధారిత పరిశోధనలను ముందుకు తీసుకెళ్లటానికి అంతర్జాతీయ శాస్త్ర పరిశోధన సంస్థల మధ్య ఏఐ నెట్‌వర్క్ ఏర్పాటు కావాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. సుస్థిర, సమర్థవంతమైన ఏఐ వినియోగానికి మార్గదర్శకాలను కూడా రూపొందించుకోవాల్సి ఉందని పేర్కొంది.

# ప్రతిభే ప్రామాణికం

## కాంగ్రెస్‌లో ఏ లిస్టులూ ఉండవు..ఉండేది ఒక్క మెరిట్ లిస్టే

కష్టపడే వారికే పదవులు

గాంధీల కుటుంబంపై బీజేపీ కుట్రలను తిప్పికొట్టాలి

సర్కార్‌పై ప్రజల్లో విశ్వాసం పెరిగింది: సీఎం రేవంత్‌రెడ్డి

తెలుగు రాష్ట్రాల డీసీసీ అధ్యక్షుల శిక్షణ తరగతులు ప్రారంభం

సీఎం రేవంత్‌రెడ్డి




**హైదరాబాద్, ఫిబ్రవరి 21**
డీసీసీ అధ్యక్ష పదవి అధికారం కాదని, అదొక బాధ్యతని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. తమకు ఒక పదవి రాగానే గాంధీభవన్ చుట్టూ, నాయకుల చుట్టూ తిరిగితే మరిన్ని పదవులు వస్తాయని చాలా మంది భావిస్తున్నారని ప్రస్తావించారు. నాయకుల ఇళ్ల దగ్గర పడిగాపులు కాసేవారికి కాకుండా జిల్లాలో పార్టీని బలోపేతం చేసేవారికే ప్రాధాన్యం ఇస్తానన్నారు. కాంగ్రెస్ పార్టీలో ఏ నాయకుడికి దగ్గర ప్రత్యేక లిస్టులు ఉండవని, కేవలం మెరిట్ లిస్ట్ మాత్రమే ప్రామాణికం అని ముఖ్యమంత్రి తేల్చి చెప్పారు. పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసే వారిని నిరంతరం పర్యవేక్షిస్తున్నామని, కష్టపడే వారికి కచ్చితంగా న్యాయం జరుగుతుందని భరోసా ఇచ్చారు. వికారాబాద్ జిల్లా అనంతగిరిలో జరుగుతున్న రెండు తెలుగు రాష్ట్రాల జిల్లా కాంగ్రెస్ కమిటీ(డీసీసీ) అధ్యక్షుల శిక్షణా తరగతుల కార్యక్రమంలో శనివారం ఆయన మాట్లాడారు. పైరవీలకు దూరంగా ఉన్నప్పుడే నాయకులకు గౌరవం పెరుగుతుందని చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారమే పరమావధిగా పని చేయాలని సూచించారు. డీసీసీ అధ్యక్షులుగా బాగా పని చేసిన వారికి ఎమ్మెల్యేలుగా అవకాశం ఇచ్చామని గుర్తు చేశారు. అనుబంధ విభాగాల్లో కష్టపడిన వారికి కార్పొరేషన్ పదవులు కట్టబెట్టామన్నారు. కాంగ్రెస్‌లో మెరిట్ కోటా తప్ప ఏ కోటా ఉండదని అన్నారు. డీసీసీ అధ్యక్ష పదవిని దుర్వినియోగం చేసి, పార్టీ విశ్వాసాన్ని దెబ్బతీయొద్దు అని నేతలను హెచ్చరించారు. డీసీసీ నుంచి పీసీసీ అధ్యక్షులు కావచ్చుని, ఎమ్మెల్యే, ఎంపీ, ముఖ్యమంత్రి కావొచ్చని గుర్తు చేశారు. తాను ఏనాడూ పదవుల కోసం పైరవీల జోలికి పోలేదని చెప్పారు. 16 ఏళ్లలో జడ్పీటీసీ నుంచి ముఖ్యమంత్రిగా ఎదిగానని, కేవలం తన పనిని పార్టీ గుర్తించడం వల్లే ఇది సాధ్యమైందని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కూడా కాంగ్రెస్ బలోపేతం కావాలని రేవంత్‌రెడ్డి ఆకాంక్షించారు. డీసీసీ అధ్యక్షులు జిల్లాకు అధిపతులమని భావించి కార్యకర్తలను, తమను వ్యతిరేకించే వారికి తొక్కేసే ప్రయత్నం చేయొద్దని సూచించారు. తాను పీసీసీ అధ్యక్షుడిగా ఎంపికైన కొత్తలో తనపై ఎంతో వ్యతిరేకత ఉన్నా పార్టీలో ఉన్న ప్రతీ నాయకుడి ఇంటికి వెళ్లి తన ఆలోచన చెప్పి అందరినీ అందరినీ ఒప్పించానన్నారు. అందరం కలిసి కృషి చేయడం వల్లే ఓటింగ్ శాతం పెరిగిందని చెప్పారు. ఆ సమన్వయం వల్లే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగట?ప్రకు ప్రత్యర్థి పార్టీకి మధ్య తేడా కేవలం రెండు శాతమని, అది లోక్‌సభ ఎన్నికలకు నాలుగు శాతానికి, మునిసిపల్ ఎన్నికల్లో 12 శాతానికి పెరిగిందని ప్రస్తావించారు. కాంగ్రెస్ కార్యకర్తలు, రాష్ట్ర ప్రజల్లో ఉన్న విశ్వాసం వల్లే ఇది సాధ్యమైందన్నారు. రాష్ట్రం నుంచి 42 లక్షల డిజిటల్ సభ్యత్వాలను నమోదు చేసి చరిత్ర సృష్టించామని చెప్పారు. 100 ఏళ్ల తర్వాత కులగణన చేపట్టడం, ఎస్సీ వర్గీకరణ అమలు చేయడం, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 49.83 శాతం, మున్సిపల్ ఎన్నికల్లో 63 శాతం ఓబీసీలకు అవకాశం కల్పించడం కాంగ్రెస్ సాధించిన విజయాలని ప్రస్తావించారు. వైఎస్ షర్మిల తండ్రి వారసత్వంగా పదవులు పొందే అవకాశం ఉన్నా 3,000 కిలోమీటర్లు పాదయాత్ర చేసి నిరూపించుకున్న తర్వాత పీసీసీ అధ్యక్షురాలిగా ఏపీలో కాంగ్రెస్ పార్టీ కోసం నిబద్ధతతో శ్రమిస్తున్నారని ప్రశంసించారు.

**గాంధీ కుటుంబంపై కుట్రలను తిప్పికొట్టాలి**
దేశం కోసం ప్రాణాలర్పించిన ఇందిరాగాంధీ కుటుంబంపై బీజేపీ కుట్రలు చేస్తోందని రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. కాంగ్రెస్ తెచ్చిన స్వాతంత్ర్యాన్ని, కాంగ్రెస్ ఇచ్చిన రాజ్యాంగాన్ని ఉపయోగించుకొని పుట్టిన పార్టీలు ఇప్పుడు కాంగ్రెస్ ముక్త భారత్ అని మాట్లాడటం అత్యంత విచారకరమన్నారు. మహాత్మాగాంధీ, ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీలు దేశం కోసం ప్రా?ణాలిచ్చారని, రాజీవ్‌గాంధీ ఆశయాల సాధన కోసం సోనియాగాంధీ సర్వం త్యాగం చేసి కాంగట?ప్రకు అండగా నిలిచారని రేవంత్‌రెడ్డి కొనియాడారు. కష్టం తెలియకుండా పదవులు పొందే అవకాశం ఉన్నా రాహుల్‌గాంధీ 4000 కిలోమీటర్ల పాదయాత్ర చేసి ప్రజా సమస్యలు తెలుసుకున్నారని ప్రస్తావించారు.

# మరీ ఇంత నీచమా?

తప్పు చేసి మాపై నిందలా?

తిరుమల పవిత్రత దెబ్బతీసే హక్కు వైసీపీ వాళ్లకు ఎవరిచ్చారు?

చెప్పులేసుకుని స్వామి ఫొటోను సభలోకి తెచ్చి విసిరికొడతారా?

అధికారంలో ఉన్నా, విపక్షంలో

ఉన్నా బూతులు తిడుతున్నారు

ఆంబోతుల్లా ప్రవర్తిస్తున్నారు

వైసీపీ వాహనాల కింద నలిగేవారిని మాత్రం పట్టించుకోరా?

పల్నాడు జిల్లా వినుకొండ పర్యటనలో సీఎం చంద్రబాబు తీవ్ర ఆగ్రహం

వృత్తాకార ఆర్థిక వ్యవస్థను పునర్నిర్వచిస్తున్నాం: సీఎం




**గుంటూరు(వినుకొండ), ఫిబ్రవరి 21**
తిరుమలలో నాడు నాసిరకం ప్రసాదాలను భక్తులకు పంచిపెట్టారని, ఇప్పుడేమో తాము చేసిన తప్పును వైసీపీ నేతలు వేరే వాళ్లపైకి నెట్టేసే నీచానికి పాల్పడుతున్నారని సీఎం చంద్రబాబు ఆగ్రహించారు. వేంకటేశ్వర స్వామిపై భక్తులకు ఉన్న నమ్మకాన్ని, పవిత్రతను దెబ్బతీసే అధికారం వీళ్లకు ఎవరిచ్చారని ప్రశ్నించారు. """సాక్ష్యాత్తు వేంకటేశ్వరస్వామి ఫొటోను కౌన్సిల్‌లోకి తీసుకెళ్లారంటే వీళ్లని ఏమనాలి? చెప్పులేసుకొని ఫొటోలు తీసుకొని వచ్చి వాటిని విసిరి పారేశారు. తమ రాజకీయ పార్టీ ఉందన్న అహంకారమే దీనంతటికి కారణం." అని మండిపడ్డారు. శనివారం స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొనేందుకు సీఎం చంద్రబాబు పల్నాడు జిల్లా వినుకొండ పట్టణానికి వచ్చారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. "మేం అధికారం చేపట్టగానే తిరుమల ప్రక్షాళనకు శ్రీకారం చుట్టి కొత్త ఈవోను నియమించాం. నెయ్యిలో కల్తీ ఉందని అప్పుడే తేలింది. ఆ శాంపిల్‌ను ఎన్‌డీడీబీకి పంపిస్తే అందులో జంతుకొవ్వు ఉందని నివేదిక వచ్చింది. అదే విషయం నేను చెప్పాను. వైసీపీ వాళ్లు లేనిపోనివి సృష్టించి సుప్రీంకు వెళితే సిట్‌ను ఏర్పాటు చేసింది. సిట్ నివేదికలో లడ్డూ తయారీలో వినియోగించినది నెయ్యే కాదని చెప్పింది. దీనిపై చర్యలు తీసుకోమని ప్రభుత్వానికి సూచించింది." అని తెలిపారు. ఇంకా ఆయన ఏమన్నారంటే.. "శివుడి తలపై పాము ఉంటే, అది ఎక్కడ కాటు వేస్తుందోనని అంతా భయపడతారు. నేను శివుడి తలపై పాము ఉంటే, ఆయనకు నమస్కారం పెట్టి, పామును బయటకు తీసుకొచ్చి ఏమి చేయాలో అది చేస్తాను. ప్రజలు కూడా తమకెందుకని కూర్చోకుండా ముందుకొచ్చి వైసీపీ లాంటి చెడు పార్టీలను నిరాకరిస్తే రాజకీయాలు ప్రక్షాళన అవుతాయి. వైసీపీ వాళ్లు అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా బూతులు తిడుతున్నారు. నేను ప్రతిపక్షంలో ఉండగా, నా భార్యను దూషించారు. ఆంబోతుల మాదిరిగా ప్రవర్తిస్తూ రెచ్చగొడుతున్నారు. రాష్ట్రాన్ని గంజాయితో సర్వనాశనం చేశారు." "గంజాయి సేవించి మదనపల్లెలో ఒక వ్యక్తి మృగంలా మారి ఏడేళ్ల చిన్నారిపై అఘాయిత్యానికి పాల్పడ్డాడు. నేను ఒకటే చెబుతున్నా. ఆడబిడ్డల జోలికొస్తే అదే వాళ్లకు చివరి రోజు. ఆ మాటకు కట్టుబడి ఉన్నాను. మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడే వాళ్లకు ఈ సమాజంలో చోటు లేదు. వాళ్లకి ఉరిశిక్ష పడాలి." " 2019 ఎన్నిలకు ముందు మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్యను తొలుత గుండెపోటుగా చిత్రీకరించారు. ఆయన కుమార్తె విజ్ఞప్తి మేరకు పోస్టుమార్టం చేస్తే అది హత్య అని తేలింది. దీంతో వాళ్లు నాటకాలు మార్చి మరుసటి రోజు ఉదయం వాళ్ల పత్రికలో 'నారాసుర రక్తచరిత్ర' అని రాశారు. నేను రాజకీయం చేస్తాను. రౌడీల గుండెల్లో రైళు పరుగెట్టిస్తా. సంఘ విద్రోహ శక్తులను అణచివేస్తాను తప్పించి నేరాలు చెయ్యను. ఇప్పుడు కల్తీ నెయ్యి వ్యవహారంలోకి హెరిటేజ్‌ను తీసుకొచ్చి నాపై తప్పు వేయాలని చూస్తున్నారు. ఇలాంటి కరుడుగట్టిన నేరస్తులతో రాజకీయం చేయాల్సి రావడం బాధాకరం. 'వైసీపీ నేత జగన్ బయటకు వస్తే బలవంతంగా మనుషులను తీసుకొస్తారు. పోతూపోతూ వాళ్ల కార్ల కిందనే అమాయక మనుషులను చంపేస్తారు. ఆ తర్వాత వాళ్లను ఏమాత్రం పట్టించుకోరు. బూతులు తిట్టిన వాళ్లను మాత్రం ఇళ్లకు వెళ్లి పరామర్శిస్తారు. వాళ్ల కోసం వచ్చి చనిపోయిన వాళ్లకు ఎలాంటి పరామర్శలు ఉండవు. దీనిని బట్టి ఆ పార్టీ నాయకుల వైఖరిపై ప్రజలే ఆలోచన చేయాలి." కాంగ్రెస్ వైఖరి గర్హనీయం.. "ఢిల్లీలోని ఏఐ సదస్సుకు అన్ని దేశాల నుంచి ప్రతినిధులు వచ్చి వాళ్లు చేసిన ఆవిష్కరణలను ప్రదర్శించారు.

## ఏప్రిల్ 1 నుంచి టోల్ ప్లాజాలో
# నగదు చెల్లింపుల్లేవు




**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21:**
టోల్ ప్లాజాల్లో నగదు చెల్లింపులను నిలివేయాలని జాతీయ రహదారుల సంస్థ(ఎన్‌హెచ్‌ఏఐ) భావిస్తోంది. ఏప్రిల్ 1 నుంచి కేవలం ఫాస్ట్‌టాగ్, యూపీఐ ద్వారా మాత్రమే చెల్లింపులను స్వీకరించే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపింది. దేశవ్యాప్తంగా టోల్ ప్లాజాల్లో పూర్తిగా నగదు లావాదేవీలను నిలిపివేసి, పూర్తి స్థాయి డిజిటల్ నేషనల్ హైవే టోలింగ్ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేయాలని భావిస్తున్నట్లు సంస్థ పేర్కొంది. టోల్ వసూళ్లలో పారదర్శకత, సామర్థ్యం పెంచడమే లక్ష్యంగా ఈ మార్పును తీసుకొనిరానున్నట్లు సంస్థ వివరించింది. గత కొద్ది సంవత్సరాలుగా టోల్ వసూళ్లలో 98్న ఫాస్ట్‌టాగ్ ద్వారానే జరుగుతున్నాయి. జాతీయ రహదారుల రుసుము నిబంధనల ప్రకారం ఇప్పటి వరకూ... ఉనికిలో లేని ఫాస్ట్‌టాగ్‌తో లేదా అసలు లేకుండా టోల్ ప్లాజా దాటాలనుకునే వాహనదారులు నిర్దేశిత రుసుముకు రెండింతలు సొమ్ము చెల్లించాలి. అదే యూపీఐ ద్వారా అయితే నిర్దేశిత ఫీజుపై 1.25 రెట్లు చెల్లిస్తే సరిపోతుంది.

# అవిముక్తేశ్వరానందపై పోక్సో కేసు పెట్టండి

## ప్రయాగ్‌రాజ్ కోర్టు ఆదేశం

**ప్రయాగ్‌రాజ్, ఫిబ్రవరి 21:** బాలురను లైంగికంగా వేధించారన్న ఆరోపణలపై శంకరాచార్య స్వామి అవిముక్తేశ్వరానంద సరస్వతిపై పోక్సో కేసు నమోదు చేయాలని శనివారం స్థానిక కోర్టు పోలీసులను ఆదేశించింది. పోక్సో చట్టం ప్రత్యేక న్యాయస్థానం జడ్జి వినోద్ కుమార్ చౌరాసియా..ఝున్సీ పోలీసు స్టేషన్ అధికారికి ఈ ఆదేశాలు ఇచ్చారు. వారణాసిలోని విద్యా మఠం అయిదో అంతస్తులో.. ఆశ్రమంలో పనిచేసే 'బట్యూ' (బాలురు)లను లైంగికంగా వేధించినట్టు అశుతోష్ బ్రహ్మచారి మహరాజ్ చేసిన ఫిర్యాదు మేరకు కోర్టు ఈ ఆదేశాలు ఇచ్చింది. మౌనీ అమావాస్య సందర్భంగా ప్రయోగ్‌రాజ్‌లో నిర్వహించిన మాఘమేళాలో అవిముక్తేశ్వరానంద పవిత్ర స్నానం చేయకుండా అధికారులు అడ్డగించడం గమనార్హం. ఆయన శంకరాచార్య పదవిలో లేరని అభ్యంతరం తెలిపారు.

# యూత్ కాంగ్రెస్ నిరసన
# వెనుక పెద్ద కుట్ర

## పాటియాలా కోర్టుకు తెలిపిన ఢిల్లీ పోలీసులు




**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21:**
ఏఐ ఇంపాక్ట్ సదస్సులో యూత్ కాంగ్రెస్ నేతలు చేపట్టిన నిరసన వెనుక పెద్ద కుట్ర ఉందని.. నేపాల్ ప్రభుత్వాన్ని కూల్చేసిన హింసాత్మక జెన్ జెడ్ ఉద్యమం నుంచి వారు ప్రేరణ పొందారని పాటియాలా హౌస్ కోర్టుకు ఢిల్లీ పోలీసులు తెలిపారు. 'నిరసన వెనుక పెద్ద కుట్ర దాగి ఉంది. ఆందోళనకారులు దేశ వ్యతిరేక నినాదాలు చేశారు. ప్రధాని మోదీ అభ్యంతరకర చిత్రాలున్న టీషర్టులను ప్రదర్శించారు. నలుగురిని అదుపులోకి తీసుకున్నాం. మరికొందరు పారిపోయారు. అందర్నీ ముఖాముఖి, డిజిటల్ ఆధారాలతో ప్రశ్నించాల్సి ఉంది. వీరికి నిధులు ఎక్కడి నుంచి అందాయన్నది గుర్తించాల్సి ఉంది. నిందితుల ఫోన్ల నుంచి డేటా సేకరించి విశ్లేషిస్తున్నాం. ఘర్షణలో ముగ్గురు పోలీసులు గాయపడ్డారు. లోతైన దర్యాప్తునకు నిందితులను 5 రోజుల పాటు కస్టడీకి అనుమతించండి' అని పోలీసులు కోరారు. 5 రోజుల పాటు నిందితుల పోలీసు కస్టడీకి న్యాయమూర్తి అనుమతించారు. కాగా, యూత్ కాంగ్రెస్ జాతీయ సమన్వయకర్త, జడ్చర్లకు చెందిన పి.నరసింహా యాదవ్ నేతృత్వంలో దాదాపు 10 మంది యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు ఏఐ సదస్సులో ప్రధాని మోదీకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ చొక్కాలు విప్పి అర్ధ నగ్న ప్రదర్శన చేపట్టిన సంగతి తెలిసిందే.

# వావ్.. సింహా తేజ

## పిట్ట కొంచెం ఘనత ఘనం

- ఎల్లలు దాటిన యువ తేజం..
- ప్రపంచ వేదికపై ప్రతిభ చాటిన సింహా తేజ
- థాయిలాండ్‌లోని బ్యాంకాక్ యునైటెడ్ నేషన్స్‌లో గ్లోబల్ కాన్ఫరెన్స్
- ప్రాతినిధ్యం వహించి రికార్డు సృష్టించిన తె(లంగాణ)లుగు విద్యార్థి
- కీసర పల్లవి ఇంటర్ నేషనల్ స్కూల్ నుండి బ్యాంకాక్ యూనిటైడ్ నేషన్స్‌కు పయనం
- ప్రపంచ కాన్ఫరెన్స్‌లో నాగారం వాసీ నయా రికార్డు
- సంతోషంలో సింహా తేజ తల్లిదండ్రులు ప్రహ్లాద్, కీర్తన దంపతులు





హైదరాబాద్ ప్రతినిధి, ఫిబ్రవరి 21 : పిట్ట కొంచేం కుత ఘనం అంటే ఇదేనేమో.. మేధస్సు, జ్ఞానం, ప్రతిభ ఉంటే వారిని ఎవరు? అపలేరు సరికదా?... ఆ ప్రతిభాశీలురికి ఎక్కడ, ఎప్పుడైన సరే, యావత్ ప్రపంచం నలు ములల గర్వపడేలా, తన సత్తా(కు)ను నిరుపించుకోనే ఓ రోజు వస్తొంది. అప్పుడు వారి సహసం, ప్రతిభకు మెచ్చి, ప్రతి ఒక్కరు సలాం కొట్టాల్సిందే. తాజాగా.. పాఠశాల విద్యనభ్యసించే ఓ తెలంగాణ విధ్యార్థి ప్రతిభ ఎల్లలు దాటింది. మేడ్చల్ జిల్లా, కీసర మండలం సత్యనారాయణ కాలనికి చేందిన జిడికంటి ప్రహ్లాద్, కీర్తన దంపతుల కుమారుడు సింహాతేజ.. బ్యాంకాక్‌లో జరిగిన యుఎన్ సమావేశంలో అరుదైన ఘనత సాదించారు. ప్రపంచంలోని వివిధ దేశాలకు చేందిన రాయబారులు, మంత్రులు, విద్యావేత్తలు, పరిశోధకులు, విశ్వవిద్యాలయ మేధావులు, యువ ప్రతినిధులు, విధాన రూపకర్తలు పాల్గోన్న ఈ ప్రతిష్టాత్మక గ్లోబల్ సమావేశంలో భారతదేశం నుంచి ప్రపంచ వేధికపై ప్రాతినిధ్యం వహించే అవకాశం ఈ యువ సృష్టికర్త.. మాస్టర్ సింహా తేజకు దక్కడం ఓ విశేషం. ఇటివల థాయిలాండ్‌లోని బ్యాంకాక్ యునైటెడ్ నేషన్స్ కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన గ్లోబల్ కాన్ఫరెన్స్ ఆన్ ఎడ్యుకేషన్ ఫర్ ఏ సస్టైనబుల్ ఫ్యూచర్‌లో మన(ఈ) తెలంగాణ విద్యార్థి అక్కడి (వేధిక) సంఘానికి ప్రాతినిధ్యం వహించి రికార్డు సృష్టించారు. అయితే, ఈ బాల మేధావి కీసర మండలం, పల్లవి ఇంటర్నేషనల్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నారు. అత్యంత పిన్న వయస్సులో ఈ బుడతడు విశ్వ వేధికను పంచుకోవడం, భారత్‌కు గర్వకారణమైన రోజుగా పలువురు మేధావులు కోనియాడారు. ప్రపంచ డెలిగెట్స్‌తో పాటు అత్యంత జ్ఞానవంతమైన యువతతో కలిసి స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా విద్య యొక్క భవిష్యత్తుపై సింహతేజ ప్రసంగించిన ఈ భారీ వేధిక.. ఆవిష్కరణ, సమానత్వం, భవిష్యత్తు(కు)పై సిద్ధంగా ఉన్న అభ్యాస వ్యవస్థలపై అర్థవంతమైన చర్చలను ప్రోత్సహిస్తుందని కాన్ఫరేన్స్‌లో సింహా తేజ చెప్పిన మాటలు... కలలుగనే నేటి యువత(కు) అక్షర సత్యాలుగా కనిపించాయట.. అ స్పీచ్‌ను విన్న వారంతా ఒక్కసారిగా తమ ఉజ్వల భవిష్యత్‌పై ఊహల్లో పడ్డారట.. విద్యా పరివర్తనలో మార్పులను రూపొందించడంలో పెరుగుతున్న యువత స్వరాన్ని, సింహ తేజ తన ప్రతిభను ద్వారా ప్రతిబింబింపచేశారని పలువురు డెలిగెట్స్ కోనియా(డారు)డటం విశేషం. ఇది అతని భవిష్యత్ విద్యా ప్రయాణాన్ని గణనీయంగా ప్రభావితం చేస్తుందని ప్రౌడ్ పేరెంట్స్ పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్ .. మాస్టర్ సింహా తేజకు దక్కిన ఈ అద్భుతమైన విజయాన్ని అభినందించారు. సింహ తేజ, రిహా, గాంధీలు సాదించిన ఈ ఘనతపై.. తొటి విద్యార్థులను సైతం ప్రపంచవ్యాప్తంగా ఆలోచించి, స్థిరమైన భవిష్యత్తు కోసం బాధ్యతాయుతంగా వ్యవహరించమని ప్రోత్సహిస్తదని, కో ఆర్డినేటర్ చింతలూరీ అన్నపూర్ణ, పల్లవి ఇంటర్ నేషనల్ స్కూల్ ప్రిన్సిపాల్ చన్నప్రగడ శ్రీలత నేతృత్వంలో విజయవంతంగా జరిగిందని వారు అభిప్రాయపడ్డారు.

ఈ నేషనల్ యునైటెడ్ కాన్ఫరెన్స్‌లో యావత్ దేశం, తెలంగాణ రాష్ట్రం, గర్వపడేలా చేసిన సింహా తేజ రికార్డ్‌తో.. తల్లిదండ్రులు ప్రహ్లాద్, కీర్తన దంపతులు ఉప్పొంగిపోయారు. ఈ సందర్భంగా తెలంగాణకు చేందిన పలువురు ప్రముఖులతో పాటు, పాఠశాల యాజమాన్యం, బంధువులు, నాగారం డివిజన్ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ.. శుభాకాంక్షలు తెలిపారు. రికార్డు సాధించిన బుడతడిని పలువురు ప్రముఖులు దీవించారు. భవిష్యత్‌లో సింహా తేజ మరింత ఉన్నత శిఖరాలకి ఎదగాలని తెలంగాణ మలిధశ ఉద్యమకారుడు, సీనీయర్ జర్నలిస్ట్, సామాజిక ఉద్యమకారులు కోడికంటి శ్రీనివాస్, రాష్ట్ర ఓబీసీ కార్యవర్గ సభ్యులు వెంగళా మధుసుధన్ తదితరులు అకాక్షించారు.

**'సింహ తేజ'కు అభినందనలు**

ఈ సందర్భంగా 'సింహ తేజ'ను "సీనీయర్ పాత్రికేయుల బృందం అభినందించింది. ఈ సందర్భంగా "మా ప్రతినిధి"తో ఆయన మాట్లాడుతూ.. తనకు దక్కిన ఈ గొప్ప అవకాశం, సత్కారం, పలువురి నుంచి వస్తున్న అభినందనలపై 'సింహ తేజ' ఇది తన జీవితంలో మరచిపోలేనని అత్యంత అరుదైన ఘటనగా ఆయన అభివర్ణించారు. ఈ రికార్డులు తనను జీవితంలో మరింత శిఖరాలకు చేరేలా ఉపయోగపడతాయని ఆయన పేర్కోన్నారు.

# అవగాహనే కాదు కార్యాచరణా అవసరమే

భారతదేశంలో క్యాన్సర్ నానాటికీ విస్తరిస్తోంది. ప్రతి ఏడాది 15 లక్షలకు పైగా కొత్త కేసులు నిర్ధారణ అవుతుండగా, దాదాపు 9 లక్షల మంది ప్రాణాలు కోల్పోతున్నారు. 2040 నాటికి ప్రతి ఏడాది కొత్త క్యాన్సర్ కేసుల సంఖ్య 20 లక్షలు దాటుతుందని, మరణాలు కూడా 12 నుంచి 15 లక్షల వరకు పెరుగుతాయని అంచనా. ప్రస్తుతం ప్రతి 9 మంది భారతీయుల్లో ఒకరికి జీవితకా లంలో క్యాన్సర్ వచ్చే అవకాశం ఉంది. సమస్యను మరింత తీవ్రం చేస్తున్న అంశం– 60 శాతం కంటే ఎక్కువ రోగులు క్యాన్సర్ పురోగతి దశల్లో చికిత్సకు వస్తున్నారు. ఈ దశలో చికిత్స అవకాశాలు పరిమితంగా ఉంటాయి. జీవనావధి ఫలితాలు కూడా ఆశించిన స్థాయిలో ఉండటం లేదు. ప్రతి అంతర్జాతీయ క్యాన్సర్ దినోత్సవం రోజున, మనం అవగాహన గురించి మాట్లాడతాం. కానీ రోగులు వ్యాధి పట్ల భయంతో, నిర్లక్ష్యంతో చికిత్సకు ఆలస్యంగా వస్తున్నారు. అవగాహన మాత్రమే సరిపోవడం లేదు. ఇప్పుడు భారత్‌కు కావలసింది నిర్ణయాత్మకంగా పాటించే చర్యలు. ఈ సంవత్సరం అంతర్జాతీయ క్యాన్సర్ దినోత్సవ థీమ్ 'యునైటెడ్ బై యూనిక్'. ప్రామాణికమైన, ఫలితమిచ్చే చర్యల వైపు అడుగులు వేయమని ఇది దేశాలకు సూచిస్తోంది. ఈ థీమ్ ప్రతి క్యాన్సర్ ప్రయాణం ప్రత్యేకమని గుర్తించి, రోగుల అనుభవాలు, విధానాలను నిర్ణయించడంలో మార్గదర్శకంగా ఉండాలని కోరుతోంది. మాటల నుంచి నిజమైన అమలుకు మార్పుగా, ప్రకటనల నుంచి బాధ్యతాయుత చర్యలకు మారవలసిన అవసరాన్ని ఈ థీమ్ సూచిస్తోంది. మన దేశంలో క్యాన్సర్ చికిత్సకు ఇప్పటికే శక్తిమంతమైన సౌకర్యాలు ఉన్నాయి. ఆయుష్మాన్ భారత్ పథకం లక్షల మందికి అధిక వైద్య ఖర్చులు తగ్గించడంలో కీలకంగా నిలిచింది. నిధులు అందించడం మాత్రమే కాదు; కాన్సర్‌ను ముందస్తు నివారణ, ప్రారంభ దశలోనే గుర్తించాల్సి ఉంది. ఆయుష్మాన్ భారత్ కింద ఉన్న హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్స్ క్రమ పద్ధతిలో క్యాన్సర్ స్క్రీనింగ్ నిర్వహించాలి. రాష్ట్రాల్లో క్యాన్సర్ స్క్రీనింగ్ సమగ్రంగా అమలు కావడం లేదు. శిక్షణ లోపాలు, బలహీనమైన రిఫరల్ వ్యవస్థలు, పర్యవేక్షణ లోపం ఉంటోంది. క్యాన్సర్, డయాబెటిస్, హృదయ సంబంధ వ్యాధులు, స్ట్రోక్‌ల నివారణ-- నియంత్రణ కోసం జాతీయ కార్యక్రమం(ఎన్‌పీసీడీసీఎస్) ఒక బలమైన రూపురేఖను అందిస్తున్నది. అయితే, అమలు సరిగా జరగని కారణంగా దాని ప్రభావం తగ్గింది. ఎన్‌పీసీడీసీఎస్‌ను ఆయుష్మాన్ భారత్‌తో అనుసంధానం చేయాలి. దీంతో ప్రాథమిక వైద్యం నుంచి జిల్లా ఆసుపత్రులు, తృతీయ స్థాయి కేంద్రాలకు నిరవధిక రిఫరల్ వ్యవస్థ అందుబా టులో ఉంటుంది. స్క్రీనింగ్ చేయించుకున్న ప్రతి వ్యక్తికీ అనుమానం నుంచి నిర్ధారణ వరకు, అక్కడి నుంచి చికిత్స వరకు–స్పష్టంగా అనుసరించగల మార్గం ఉండాలి. పెద్ద నగరాల్లోని ఆసుపత్రుల మీద మాత్రమే భారత్ ఆధారపడకూడదు. జిల్లా ఆసుపత్రులు నిజమైన క్యాన్సర్ కేంద్రాలుగా పనిచేయాలి. ఇందుకు– అంకాలజీ ప్రాథమిక విషయాల్లో శిక్షణ పొందిన డాక్టర్లు కావాలి; పాథాలజీ, ఇమేజింగ్ సేవలు పనిచేయాలి; జిల్లా ఆసుపత్రులు, పెద్ద ఆసుపత్రులతో టెలికాన్సర్ బోర్డ్స్ ద్వారా శిక్షణ కావాలి; రిఫరల్ ఎలా చేయా లో స్పష్టమైన మార్గదర్శకాలు ఉండాలి. క్యాన్సర్‌ను ప్రారంభ దశలో గుర్తించి, సరైన కేంద్రానికి రిఫర్ చేయగల సామర్థ్యం ఉండాలి. ఇలా చేయడం ప్రాణనష్టాన్ని తగ్గిస్తుంది. 'యునైటెడ్ బై యూనిక్' అనే భావన క్యాన్సర్ సంరక్షణ కేవలం వైద్యపరమైనదే కాదు, అది లోతైన మానవీయత అంశమని మనకు గుర్తుచేస్తుంది. భయం, అపఖ్యాతి (స్టిగ్మా), అయోమయం, ఆర్థిక ఆందోళనలు వంటివి, క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలకు రాకుండా రోగులను వెనక్కు తగ్గేలా చేస్తాయి. ప్రజాకేంద్రీకృత సంరక్షణ అంటే-- నిజాయితీతో కూడిన, కరుణాత్మక సంభాషణ; విభిన్న వైద్య నిపుణుల సమూహ చర్చ ద్వారా నిర్ణయాలు; చికిత్సతో పాటు మానసిక, సామాజిక మద్దతు అందించడం; సమాచారంతో కూడిన నిర్ణయ స్వేచ్ఛకు గౌరవం ఇవ్వడం... వీటితో ఫలితాలు మెరుగుపడతాయి. క్యాన్సర్ ఫలితాలను మెరుగు పర చడంలో బలమైన క్యాన్సర్ రిజిస్ట్రీలు కీలకం. రోగుల సమాచారం, క్యాన్సర్ సంభవించే భౌగోళిక ధోరణులు, క్యాన్సర్ రకాలపై తులనాత్మక విశ్లేషణ ద్వారా ప్రమాద కారకాలను అంచనా వేయడం, వ్యాధి వచ్చే అవకాశం ఎక్కువగా ఉన్నవారిని గుర్తించడంతో పాటు క్యాన్సర్ నివారణ, స్క్రీనింగ్ కార్యక్రమాలను ప్రణాళిక చేయడం సాధ్యమవుతుంది. ప్రస్తుతం దేశంలో కేవలం 38 జనాభా ఆధారిత క్యాన్సర్ రిజిస్ట్రీలు (ూదీజ=ం) మాత్రమే ఉన్నాయి. ఇవి దేశ జనాభాలో కేవలం 10శాతం మందిని మాత్రమే కవర్ చేస్తున్నాయి. విచారకరమైన విషయం ఏమిటంటే, వీటిలో ఎక్కువ భాగం పట్టణ ప్రాంతాల్లోనే ఉండగా, గ్రామీణ ప్రాంతాలకు అంకితమైనవి కేవలం రెండు మాత్రమే. సేకరించే డేటా నాణ్యతను నిర్ధారి ంచడంలో ఈ రిజిస్ట్రీలు నిధుల కొరత కారణంగా పరిమితులు ఎదుర్కొంటున్నాయి. ఆంధ్రప్రదేశ్, హర్యానా, ఛత్తీస్‌గఢ్, హిమాచల్‌ప్రదేశ్, ఝార్ఖండ్, ఒడిశా, రాజస్థాన్ వంటి రాష్ట్రాల్లో ఇప్పటికీ జనాభా ఆధారిత క్యాన్సర్ రిజిస్ట్రీ ఒక్కటి కూడా లేదు. ఆసుపత్రుల్లో నమోదయ్యే క్యాన్సర్ రోగుల వివరాలకే పరిమితమైన 268 ఆసుపత్రి ఆధారిత క్యాన్సర్ రిజిస్ట్రీలు ఉన్నా, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో మరిన్నిూదీజ=లను ఏర్పాటు చేసి, సమర్థవంతంగా పనిచేయించాలి. ఆరోగ్యం, కుటుంబ సంక్షేమంపై పార్లమెంటరీ స్థాయి కమిటీ 2022 సెప్టెంబర్‌లో క్యాన్సర్‌ను 'నోటిఫైయబుల్ వ్యాధి'గా వర్గీకరించాలని సిఫార్సు చేసింది. అయితే, ఇది ఇప్పటివరకు వాస్తవరూపం దాల్చలేదు.

# వాణిజ్య బంధాలూ సమర వివాదాలూ

రాష్ట్రపతి ప్రసంగం ముగిసిన తర్వాత కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన రెండో రోజే పార్లమెంటులో తీవ్ర గందరగోళం నెలకొన్నది. దీన్నిబట్టి చూస్తే అసలు పార్లమెంట్ సమావేశాలు సజావుగా జరగాలన్న ఉద్దేశం అటు ప్రతిపక్షాలకు కానీ, ఇటు ప్రభుత్వానికి కానీ ఉన్నదా అన్న అనుమానం వస్తోంది. సాధారణంగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన తర్వాత రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరగడం ఆనవాయితీ. ఆ తర్వాతే బడ్జెట్ ప్రతిపాదనలపై చర్చలు మొదలవుతాయి. పార్లమెంటు ఉభయ సభలనుద్దేశించి రాష్ట్రపతి వెలువరించే ప్రసంగం ఒక రకంగా ప్రభుత్వ విధాన డాక్యుమెంట్. నిజానికి మోదీ ప్రభుత్వం అమలుపరుస్తోన్న వివిధ సంక్షేమ పథకాలు, కార్యక్రమాలు, మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఇస్తోన్న ప్రాధాన్యం గురించి రాష్ట్రపతి ప్రసంగం వివరించింది.. రాజకీయ విభేదాలు విస్మరించి వికసిత్ భారత్ లక్ష్యానికి అనుగుణంగా జాతీయ ప్రజాప్రతినిధులు అందరూ దేశ ప్రయోజనాలకోసం కలిసికట్టుగా కృషి చేయాలని రాష్ట్రపతి పిలుపునిచ్చారు. విచిత్రమేమంటే బడ్జెట్ ప్రవేశపెట్టిన మరుసటి రోజే పాలక, ప్రతిపక్షాల మధ్య తీవ్ర వాదోపవాదాలతో సభా సమావేశాలు కొనసాగలేని పరిస్థితి ఏర్పడింది. ఇందుకు ఎవరు కారణం? రాష్ట్రపతి ప్రసంగంపై సోమవారం నాడు ప్రారంభమైన చర్చలో బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య కాంగ్రెస్‌పై వాడి వేడి బాణాలు సంధించారు. భారతీయ నాగరికత, సంస్కృతి, జాతీయవాదం, దేశభక్తి అనే వాటికి కాంగ్రెస్ పార్టీ తీవ్ర వ్యతిరేకమని ఆయన మాట్లాడిన మాటలు కాంగ్రెస్‌ను రెచ్చగొట్టాయి. ఇప్పటికే అనేక గాయాలతో రెచ్చిపోతున్న కాంగ్రెస్ ఊరుకుంటుందా? ఆ వెంటనే కాంగ్రెస్ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ రంగంలోకి దిగి తమ దేశ భక్తిని, జాతీయవాదాన్ని శంకించడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. 'మా దేశ భక్తి గురించి, భారతీయ సంస్కృతి గురించి బీజేపీ యువ ఎంపీ వ్యాఖ్యలు చేసినందుకే నేను కొన్ని వాక్యాలను చదివి వినిపించదలుచుకున్నాను' అని రాహుల్ మొదలుపెట్టారు. 'ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ' పేరిట 2020లో చైనాతో జరిగిన సరిహద్దు ఘర్షణపై మాజీ ఆర్మీ చీఫ్ జనరల్ ఎంఎం నరవణే రచించిన పుస్తకంలో ఉన్న అంశాలపై 'కారవాన్' అనే పత్రిక వెలువడిన ఆ పుస్తక భాగాలను చదవ సాగారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ గురించి నరవణే రాసిన వాక్యాలను చదవడం మొదలుపెట్టగానే బీజేపీ ఎంపీలు తీవ్ర గందరగోళం సృష్టించారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, హోంమంత్రి అమిత్ షా, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు తీవ్ర అభ్యంతరం తెలిపారు. ఇంకా ప్రచురణ కాని ఆ పుస్తకంలోని వాక్యాలను ఎలా చదువుతారని మంత్రులు ప్రశ్నించారు. స్పీకర్ ఓం బిర్లా కూడా 342 నిబంధన క్రింద అలా చదవడం కుదరదని స్పష్టం చేశారు. అధికార ప్రతిపక్ష సభ్యుల మధ్యే కాక, స్పీకర్‌కూ, ప్రతిపక్ష సభ్యుల మధ్య కూడా వాగ్వివాదం జరిగింది. మంగళవారం కూడా ఇదే పరిస్థితి కొనసాగింది. తాను నరవణే పుస్తకంలో ఉన్న అంశాలు సరైనవేనని సాధికారికంగా చెబుతున్నానంటూ రాహుల్ స్పీకర్‌కు నోట్ సమర్పించి మరీ మళ్లీ ప్రసంగం ప్రారంభించారు. అయితే అధికార పక్షం వారు యథా ప్రకారం రాహుల్ మాట్లాడకుండా అడ్డుకున్నారు. ప్రధానమంత్రి అన్న పదం ఉచ్చరించినప్పుడల్లా స్పీకర్ అడ్డుకున్నారు. రాహుల్‌ను అడ్డుకుంటున్నారని గందరగోళం సృష్టించినందుకు ఎనిమిది మంది కాంగ్రెస్ ఎంపీలను సస్పెండ్ చేశారు. చివరకు అనేక వాయిదాల తర్వాత సభ మళ్లీ బుధవారానికి వాయిదా పడింది. అసలీ పరిస్థితి ఎందుకు వచ్చింది? తేజస్వి సూర్య విమర్శనాస్త్రాలే కాంగ్రెస్‌ను రెచ్చగొట్టాయా? జనరల్ నరవణే పుస్తకంలోని అంశాలను రాహుల్ ప్రస్తావించకుండా బీజేపీ ఎందుకు అడ్డుకుంటోంది? నిజానికి నరవణే పుస్తకం వెలుగులోకి రాకుండా గత రెండేళ్లుగా కేంద్రం అడ్డుకుంటోంది. ఆ పుస్తకం ప్రచురించడానికి రక్షణమంత్రిత్వ శాఖ, విదేశాంగమంత్రిత్వ శాఖ ఇంతవరకూ పబ్లిషర్‌కు అనుమతినీయలేదు. 'నేను రాయాల్సింది రాశాను. ఇక ఆ పుస్తకాన్ని ఎలా విడుదల చేయాలో పబ్లిషరే తేల్చుకోవాలి' అని నరవణే అన్నారు. ఆ పుస్తకంలో తాను రాసిన అంశాలపై వస్తున్న వివాదం విషయమై కూడా ఆయన ఏ మాత్రం స్పందించలేదు. 'కారవాన్'లో వచ్చిన పుస్తక భాగాలపై కూడా ఆయన వ్యాఖ్యానించలేదు. అంటే తాను రాసిన వాటికి ఆయన కట్టుబడి ఉన్నట్లే కదా. భారత్ చైనాల మధ్య సరిహద్దు ఘర్షణలు కొత్త కాదు. ఆ పొరుగు దేశంతో విభేదాలు యుద్ధానికి దారితీయడంలో నెహ్రూ ప్రభుత్వ తప్పిదాల గురించి అనేక పుస్తకాలు వచ్చాయి. చైనాతో యుద్ధం జరుగుతున్నప్పుడు అసోంను కోల్పోతామేమోనన్న ఆవేదనను నెహ్రూ వ్యక్తపరిచారు. 'నా హృదయం అసోం ప్రజలకోసం తపిస్తోంది..' అన్న ఆయన ఆవేదనాపూరిత వ్యాఖ్యలు సంచలనం సృష్టించాయి. కాంగ్రెస్ హయాంలో జరిగిన అనేక తప్పిదాలు, సంభవించిన పరాజయాలు, వాటిల్లిన వైఫల్యాలను కప్పిపుచ్చడానికి ఎవరూ ప్రయత్నించలేదు. ఇవాళ కాంగ్రెస్ పార్టీ దేశ రక్షణ, భద్రత నుంచి అనేక విషయాల్లో ఆత్మరక్షణలో పడేందుకు, ఎన్నికల పరాభవాల నుంచి కోలుకోలేకపోతున్నందుకు అవే కారణం. మరి మోదీ హయాంలో ఇలాంటి విషయాలపై చర్చ జరిగేందుకు కూడా ఆస్కారం లేకుండా పోతోంది. ఏ చిన్న విజయం లభించినా ఉప్పొంగి పోయి, అమితోత్సాహం ప్రదర్శించి ప్రచారార్భాటాలు చేసేవారు జాతీయ ప్రాధాన్యమున్న వివాదాలపై చర్చించడానికి నిరాకరించడం దేనికి? జనరల్ నరవణే పుస్తకం బయటకు వచ్చి ఉంటే దానిపై కొద్ది రోజులు చర్చ జరిగి సమసిపోయివుండేది. గల్వాన్ లోయలో చైనా చొచ్చుకు వస్తున్నప్పుడు 'మీకేది సముచితమో అదే చేయండి' అని ప్రధానమంత్రి తనకు చెప్పారని రక్షణమంత్రి వెల్లడించినట్లు నరవణే రాశారు. ఆ సమయంలో జరిగిన ఘటనలేమిటో, ఎంతమందితో ఎన్ని చర్చల తర్వాత, ఎన్ని తర్జనభర్జనల తర్వాత ప్రధానమంత్రి సమస్యను ఆర్మీకే వదిలేయాలని అనుకున్నారో పార్లమెంటు సాక్షిగా వివరించడం సాధ్యం కాదు. అదే సమయంలో వివాదాన్ని పూర్తిగా తొక్కిపెట్టి పార్లమెంటులో ఎవరినీ గొంతెత్తనీయకుండా చేయడం కూడా రకరకాల అనుమానాలకు దారితీస్తుంది. నిజానికి బడ్జెట్ సమావేశాల్లో బడ్జెట్‌పై చర్చ జరగాలి. బడ్జెట్‌కు కొద్ది రోజుల ముందే యూరోపియన్ యూనియన్‌తో కుదిరిన 'సమస్త ఒప్పందాలకూ తల్లి' లాంటి ఒప్పందం కుదరడంపై సానుకూల చర్చ జరిగేందుకు వాతావరణం కల్పించాలి.

# ప్రభుత్వ భవనాలను మండల కేంద్రంలోనే నిర్మించాలి




**నాగారం, ఫిబ్రవరి 21**

మండల కేంద్రంలోనే ప్రభుత్వ భవన నిర్మాణాలను చేపట్టాలని అఖిల పక్షాల ఆధ్వర్యంలో మూడో రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్ష. ఈ సందర్భంగా అఖిలపక్ష నాయకులు మాట్లాడుతూ స్థానిక తుంగతుర్తి శాసనసభలు మండల సామెల్ కుట్రపూరితంగానే నాగారం మండల కేంద్రం లోని ప్రభుత్వ భవనాలను పక్క గ్రామ పంచాయతీ అయినా నాగారం బంగ్లాకు మార్చాలని చూస్తున్నారని అన్నారు.నా అమ్మమ్మ ఊరు మా ఊరు నేను పుట్టిన ఊరు నాగారమే అని నా మాయిముంత ఇక్కడనే ఉందని స్థానిక ఎన్నికల సందర్భంగా నాగారం గ్రామాన్ని దత్తత తీసుకుంటా అని అని చెప్పి మొసలి కన్నీరు కార్చి సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నారని అన్నారు. మండల కేంద్రం నుండి భవనాలను వేరే చోటుకు మార్చినట్లయితే ఆత్మబలిదానానికైనా తాము వెనుకాడ బోమని ఈ సందర్భంగా అఖిలపక్ష నాయకులు అన్నారు.ఈ దీక్ష కార్యక్రమంలో నాగారం గ్రామ ఉప సర్పంచ్ వంగూరి అంజి యాదవ్,మండల జేఏసీ నాయకులు చిప్పలపల్లి నాగార్జున్, బిఆర్ఎస్ నాయకులు మురళి,బిఆర్ఎస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ చిప్పలపల్లి పండు,విక్రమ్ మహేష్,యాదగిరి, కన్నెబోయిన అవిలయ్య, సంతు, సోమయ్య పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరాలను నిరుపేదలు సద్వినియోగం చేసుకోవాలి

**బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్**





**కుత్బుల్లాపూర్,ఫిబ్రవరి 21**

జగద్గిరిగుట్ట డివిజన్ రాజీవ్ గృహకల్ప వద్ద గల సంస్కృతి హై స్కూల్ నందు మల్లారెడ్డి హాస్పిటల్ మరియు లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ (నార్త్) సౌజన్యంతో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... నిరుపేదలు అత్యధికంగా నివసించే జగద్గిరిగుట్ట ప్రాంతంలో ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్న సంస్కృతి హై స్కూల్ యాజమాన్యానికి, మల్లారెడ్డి హాస్పిటల్ డాక్టర్ల బృందానికి, లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ (నార్త్) సభ్యులకు నా అభినందనలు. ఉచిత వైద్య శిబిరాలను నిరుపేదలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ గడ్డమీది బాల్ రాజ్, కార్పొరేటర్ జగన్, శ్రీ వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, సీనియర్ నాయకులు ఆజం, మెట్ల శ్రీను, త్రివేణి, లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ నార్త్ అధ్యక్షులు బి.ఆంజనేయులు, చల్లా శ్రీనివాస్ రెడ్డి, వినోద్ జాదవ్, సిహెచ్.నరసింహులు, ఎస్. ఆర్. భాషా, మల్లారెడ్డి హాస్పిటల్ డాక్టర్ల బృంధం తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా పసునూరు మోడల్ స్కూల్లో వీడ్కోలు సమావేశం




**నాగారం,ఫిబ్రవరి 21**

నాగారం మండల పరిధిలోని పసునూరులో గల మోడల్ స్కూల్లో శనివారం నాడు ఇంటర్మీడియట్ వీడ్కోలు సమావేశం వేడుక ఘనంగా నిర్వహించారు.ఈ వేడుకకు స్థానిక నాగారం మండలం ఎస్సై చిరంజీవి గారు హాజరైనారు. సందర్భంగా ఎస్ఐ గారు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ తో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు, విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాలలో ముందుండా లన్నారు. ఈ సందర్భంగా మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ బల్గూరి చంద్రబాబు మాట్లాడుతూ విద్యార్థులు విద్యార్థి దశలోనే ఉన్నత లక్ష్యాలని ఎంపిక చేసుకుని వాటిని సాధించడానికి నిరంతరం కృషి చేయాలన్నారు, సమాజంలో మంచి హోదా గుర్తింపు రావాలంటే చదివే శరణ్యమని చదివే జీవితానికి మంచి విలువ అన్నారు. అనంతరం ఇంటర్మీడియట్ విద్యార్థిని విద్యార్థులు తమ అనుభవాలను గుర్తు చేసుకు న్నారు . విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి ఈ కార్యక్రమంలో అధ్యాపకులు బాలరాజు సోమసుందర్ రవి లింగరాజు కృష్ణ నాగరాజు వీరన్న అశోక్ లింగయ్య మహేష్ కలింగయ్య పిడి మహేష్ శ్రావణ్ వెంకన్న నరేష్ సాయిరాం సాధన రాధా విజయలక్ష్మి హసీనా సుమారాణి వెంకటరమణ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇకపై గూగుల్ ఏఐ మీకు వచ్చే వ్యాధులను ఇలా చెప్పేస్తుంది..!

జన్యు పరిశోధన రంగంలో మరో కీలక అడుగు ముందుకు పడింది. గూగుల్ డీప్‌మైండ్ శాస్త్రవేత్తల కోసం ప్రత్యేకంగా రూపొందించిన కొత్త కృత్రిమ మేధస్సు సాధనం ఆల్ఫా జీనోమ్ ను విడుదల చేసింది. వ్యాధులకు కారణమయ్యే జన్యు మార్పులను గుర్తించడం, కొత్త చికిత్సల అభివృద్ధికి దోహదపడటం ఈ సాధన ప్రధాన లక్ష్యం. ఆల్ఫా జీనోమ్ ఒకేసారి దాదాపు పది లక్షల డీఎన్ఏ అక్షరాలను విశ్లేషించగల సామర్థ్యం కలిగి ఉంది. జన్యు మార్పులు జీన్‌ల పనితీరుపై ఎలా ప్రభావం చూపుతున్నాయి, ఏ కణాల్లో అవి క్రియాశీలకంగా మారుతు న్నాయి, ఎంత స్థాయిలో పని చేస్తున్నాయనే అంశాలను ఇది అంచ నా వేస్తుంది. హృద్రోగాలు, ఆటో ఇమ్యూన్ సమస్యలు, మానసిక ఆరో గ్య రుగ్మతలు, అనేక రకాల క్యాన్సర్లు వంటి సాధారణ వంశపారంపర్య వ్యాధులు ప్రోటీన్ తయారీ జీన్‌ల మార్పుల వల్ల కాకుండా, జీన్‌ల నియంత్రణలో వచ్చే మార్పుల వల్లే ఏర్పడుతున్నాయని శాస్త్రవేత్తలు చెబు తున్నారు. అయితే ఏ మార్పు అసలు కారణమో గుర్తించడం ఇప్పటివరకు పెద్ద సవాలుగా మారింది.

**మానవ, ఎలుకల జన్యు డేటాతో శిక్షణ..**

ఈ సందర్భంగా డీప్‌మైండ్ పరిశోధకురాలు నటాషా లాటిషేవా మాట్లాడుతూ జీనోమ్ ఎలా పనిచేస్తుందో లోతుగా అర్థం చేసుకోవడానికి, జీవనాన్ని నియంత్రించే జీవ శాస్త్ర కోడ్‌పై పరిశోధనను వేగవంతం చేయడమే మా లక్ష్యం.. అని పేర్కొన్నారు. మనిషి జీనోమ్‌లో దాదాపు మూడు బిలియన్ల డీఎన్ఏ అక్షర జంటలు ఉంటాయి.


# నిద్రకు అరోమా థెరపీ



సోషల్ మీడియాలో రోజుకో ట్రెండ్‌ను వైరల్ చేస్తుంటారు. ఫలితాలు ఎలా ఉన్నా.. చాలామంది దాన్ని ఫాలో అవుతుంటారు. ప్రస్తుతం.. 'నిమ్మకాయ–ఉప్పు' కాంబినేషన్‌లో.. ఓ సరికొత్త అరోమా థెరపీ నెట్టింట తెగ ప్రచారంలో ఉన్నది. ఓ నిమ్మపండును కోసి, దానిపై కాస్తంత ఉప్పు చల్లి.. బెడ్ పక్కన పెట్టుకోవడం చాలామందికి రివాజుగా మారింది. ఈ థెరపీ వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని ఇన్‌ఫ్లూయెన్సర్లు చెబుతున్నారు. గాలిలోని బ్యాక్టీరియాను నిమ్మకాయ పీల్చుకుని.. గాలిని శుద్ధి చేస్తుందని చెబుతున్నారు. నిమ్మకా యలోని 'లిమోనిన్' అనే పదార్థం.. మంచి సువాసనను అందిస్తుంది. రాత్రంతా ఈ సిట్రస్ వాసనను పీల్చడం వల్ల మనసుకు ప్రశాంతత లభిస్తుంది. ఒత్తిడి తగ్గి.. కంటినిండా నిద్ర పట్టే అవకాశం ఉంటుంది. జలుబు, సైనస్ ఉన్నప్పుడు.. ముక్కులు పట్టేస్తాయి. అదే నిమ్మ వాసన పీల్చడం వల్ల శ్వాస తీసుకోవడం తేలికగా అవుతుంది. అంతేకా కుండా, రాత్రంతా నిమ్మకాయ వాసన పీల్చడం వల్ల బీపీ కూడా తగ్గుతుందట. ఇక నిమ్మకాయ వాసన.. దోమలు, ఈగలు వంటి కీటకాలను దూరం కొడుతుంది. దాంతో దోమల బాధ తప్పుతుంది కూడా!

## ఈ అలవాట్లు మీకు ఉన్నాయా..

**అయితే మీ కిడ్నీల ఆరోగ్యం దెబ్బ తింటుంది జాగ్రత్త..!**



మనం తీసుకునే ఆహారంపైనే మన శరీర ఆరోగ్యం ఆధారపడి ఉంటుంది. ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకున్నప్పుడే శరీరంలోని అవయవాలతో సహా మొత్తం శరీరానికి మేలు కలుగుతుంది. అనారోగ్యకరమైన ఆహారం శరీరంలోని అవయవాలకు హానిని కలిగిస్తుంది. మనం తీసుకునే ఆహారం మూత్రపిండాల ఆరోగ్యాన్ని కూడా ప్రభావితం చేస్తుంది. మూత్రపిండాలు రక్తాన్ని శుద్ధి చేసి అందులో ఉండే విష పదార్థాలను బటయకు పంపిస్తాయి. మూత్రపిండాల ఆరోగ్యం దెబ్బతింటే మొత్తం శరీర ఆరోగ్యం దెబ్బతింటుంది. మనం తీసుకునే ఆహారాలు కొన్ని మూత్రపిండాలపై ఒత్తిడిని కలిగించడంతో పాటు మూత్రపిండాల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయని వైద్యులు చెబుతున్నారు. ఈ ఆహారాలను తీసుకోవడం వల్ల మూత్రపిండాల సమస్యలు తలెత్తుతాయి. మూత్రపిండాల ఆరోగ్యానికి హానిని కలిగించే ఆహారాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

**జంక్ ఫుడ్స్, ప్రాసెస్డ్ ఫుడ్స్..**

జంక్‌ఫుడ్ ను ఎక్కువగా తీసుకోవడం వల్ల మూత్రపిండాలపై ఒత్తిడి ఎక్కువగా పడుతుంది. వీటిలో ఉప్పుతో పాటు ప్రిజర్వేటివ్స్ ఉంటాయి. ఇవి మూత్రపిండాలపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తాయి. ఫ్రెంచ్ ఫ్రైస్, ప్యాక్ చేసిన ఆహారాలు, పిజ్జా వంటివి మూత్రపిండాల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయని వైద్యులు చెబుతున్నారు. అలాగే మాంసంలో ప్రోటీన్ ఎక్కువగా ఉంటుంది. ఈ ప్రోటీన్ మూత్రపిండాలపై ఒత్తిడిని పెంచుతుంది. మాంసాన్ని ఎక్కువగా తీసుకోవడం వల్ల మూత్రపిండాల పనితీరు తగ్గుతుంది. శరీరంలో యూరిక్ యాసిడ్ ఎక్కువగా తయారవు తుంది. ఇది మూత్రపిండాల వైఫల్యానికి దారి తీస్తుంది. కనుక మాంసాన్ని కూడా తక్కువగా తీసుకోవాలి. అదే విధంగా చక్కెర పానీయాలు, తీపి ఆహారాలు ఎక్కువగా తీసుకోవడం వల్ల కూడా మూత్రపిండాల ఆరోగ్యం దెబ్బతింటుంది. తీపి పదార్థాలు రక్తంలో చక్కెరను పెంచుతాయి. రక్తంలో ఎక్కువగా ఉండే చక్కెర స్థాయిలు మూత్రపిండాలకు హానిని కలిగిస్తాయి.

**పండ్లు, కూరగాయలు..**

వీటితో పాటు మనలో చాలా మంది సాసేజ్‌లు, బేకన్, ప్యాక్ చేసిన మాంసం, ప్రాసెస్ చేసిన, డీప్ ఫ్రై ఆహారాలను ఎక్కువగా తీసుకుంటున్నారు. ఇవి మూత్రపిండాల ఆరోగ్యాన్ని దెబ్బతీయడంతో పాటు బీపీ, ఊబకాయం వంటి ఇతర అనారోగ్య సమస్యలకు కూడా కారణమవుతాయి. ఇవన్నీకూడా మూత్రపిండాల ఆరోగ్యానికి హానికరం. కనుక ఈ ఆహారాలను తీసుకోవడం చాలా వరకు తగ్గించాలని వైద్యులు చెబుతున్నారు. ఈ ఆహారాలకు బదులుగా మూత్రపిండాలకు మేలు చేసే ఆహారాలను తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. పండ్లు, కూరగాయలు వంటి వాటిని తీసుకోవాలి. సమతుల్యమైన ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకునే ప్రయత్నం చేయాలి. రోజూ 8 నుండి 10 గ్లాసుల నీటిని తాగాలి. క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. శరీర బరువు అదుపులో ఉంచుకోవాలి. రక్తపోటు, డయాబెటిస్ వంటి వ్యాధులు అదుపులో ఉండేలా జాగ్రత్త వహించాలి. దీని వల్ల మూత్రపిండాలపై ఒత్తిడి ఎక్కువగా పడకుండా ఉంటుంది. మూత్రపిండాలకు సంబంధించిన పరీక్షలు చేయించుకుంటూ ఉండాలి. ఈ విధంగా సరైన ఆహారం, తగిన జాగ్రత్తలు తీసుకోవడం వల్ల మూత్రపిండాల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని, మూత్రపిండాలకు సంబంధించిన అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం కూడా తక్కువగా ఉంటుందని వైద్యులు తెలియజేస్తున్నారు.



# ఇంతకు మించిన వార్త లేదా?

అగ్ర కథానాయిక తాప్సీ తన వైవాహిక జీవితం గురించి ఇప్పటివరకు ఎక్కడా మాట్లాడలేదు. గతకొంతకాలంగా మీడియాకు కాస్త దూరంగా ఉంటూ సినిమాల మీదనే దృష్టి పెడుతున్నదీ భామ. 2023లో డెన్మార్క్‌కు చెందిన బ్యాడ్మింటన్ ప్లేయర్ మథియాస్ బోతో తాప్సీ వివాహబంధంలోకి అడుగుపెట్టిన విషయం తెలిసిందే. విరామ సమయాల్లో తన అత్తామామలను కలిసేందుకు డెన్మార్క్ వెళ్లివస్తుంటుంది తాప్సీ. ఈ నేపథ్యంలో ఆమె డెన్మార్క్‌కు మకాం మార్చిందని, కేవలం షూటింగ్ సమయాల్లోనే ముంబయికి వస్తున్నదని కొన్ని ఆంగ్ల పత్రికల్లో కథనాలొచ్చాయి. వీటిపై తాజా ఇంటర్వ్యూలో స్పందించింది తాప్సీ. తాను డెన్మార్క్‌కు షిఫ్ట్ అయినట్లు ఓ ఆంగ్లపత్రిక రాసిన వార్తను ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో షేర్ చేస్తూ సెటైరికల్‌గా రియాక్ట్ అయింది. ‘ఈ పత్రిక వారికి ఇంతకు మించిన సెన్సేషనల్ వార్త దొరకలేదు కావొచ్చు. ఏదైనా వార్త రాసేముందు కొంచెం పరిశోధన చేయండి. మీకో విషయం చెప్పాలి%ొ% ముంబయిలోని ఈ చల్లటి వాతావరణంలో దోశ తింటూ నేను ఈ వార్తను చదువుతున్నా’ అంటూ వ్యంగ్యంగా కామెంట్ చేసింది. ఆమె పోస్ట్ వైరల్‌గా మారింది. ప్రస్తుతం తాప్సీ హిందీలో గాంధారి, ఓ లడ్‌కీ హై కహాన్ చిత్రాల్లో నటిస్తున్నది.

# నాకో బ్యాడ్ హాబిట్ ఉంది!



దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా ఏం చేసినా సంచలనమే. ‘అర్జున్ రెడ్డి’ ‘యానిమల్’ చిత్రాలతో ఫిల్మ్‌మేకింగ్, స్టోరీ ప్రజెంటేషన్ పరంగా కొత్త ఒరవడిని సృష్టించారు. ఈ స్టార్ డైరెక్టర్ ప్రస్తుతం ప్రభాస్‌తో ‘స్పిరిట్’ చిత్రాన్ని తెరకెక్కిస్తున్న విషయం తెలిసిందే. గురువారం ప్రభాస్ జన్మదినం సందర్భంగా ఆయన తాజా చిత్రాల సంగతులతో పాటు కొత్త పోస్టర్స్ అభిమానుల్ని అలరించాయి. సౌండ్‌స్టోరీ పేరుతో ‘స్పిరిట్’ చిత్రానికి సంబంధించిన ఓ ఆడియో క్లిప్‌ని రిలీజ్ చేశారు. ఇందులో కేవలం సంభాషణల ద్వారానే కథాంశం గురించి బేసిక్ డిటేయిల్స్ అందించే ప్రయత్నం చేశారు. ప్రభాస్, ప్రకాష్‌రాజ్ మధ్య చోటుచేసుకునే ఇంటెన్స్ డైలాగ్ వార్ గూజ్‌బంప్స్ తెప్పించేలా ఉంది. ఆడియో క్లిప్‌లోని సంభాషణలను బట్టి ఈ సినిమాలో ప్రభాస్ ఐపీఎస్ ఆఫీసర్ అని అర్థమవుతున్నది. అయితే ప్రవర్తన సరిగ్గా లేదనే కారణంతో రిమాండ్ ఖైదీగా జైలుకి వెళ్తాడు. అక్కడ సూపరింటెండెంట్‌గా ఉన్న ప్రకాష్‌రాజ్..ప్రభాస్‌ని ఖైదీ డ్రెస్‌ను ధరించమని ఆదేశిస్తాడు. అందుకు తిరస్కరించిన ప్రభాస్ ‘డియర్ సూపరింటెండెంట్ సార్.. చిన్నప్పటి నుంచి నాకో చెడ్డ అలవాటు ఉంది. రైట్ ఫ్రమ్ మై చైల్డ్‌వుడ్.. ఐ హ్యావ్ ఏ బ్యాడ్ హాబిట్’ అని చెప్పడం హైలైట్‌గా నిలిచింది. ఈ డైలాగ్‌ని బట్టి ప్రభాస్ క్యారెక్టర్ ధిక్కార స్వభావంతో ఉండబోతున్నదని అర్థమవుతున్నది. సినిమా గ్లింప్స్‌ని ఆడియో ద్వారా తెలియజేయడం ఇదే ప్రథమమని.. సరికొత్త ప్రయోగమిదని అంటున్నారు. ఈ చిత్రంలో ప్రభాస్ సరసన త్రిప్తి డిమ్రి కథానాయికగా నటిస్తున్నది. ఈ పాన్ ఇండియా చిత్రం త్వరలో సెట్స్‌మీదకు వెళ్లనుంది.

# శ్రీలంకలో ‘పెద్ది’ సందడి



రామ్‌చరణ్ తాజా చిత్రం ‘పెద్ది’ ఫస్ట్ గ్లింప్స్‌తోనే సినీ ప్రేమికుల్లో ఆసక్తినిరేకెత్తించింది. ఈ రూరల్ స్పోర్ట్స్ డ్రామాలో రామ్‌చరణ్ మేకోవర్, ఆయన రగ్గ్‌డ్ లుక్స్ అభిమానుల్ని సర్‌ప్రైజ్ చేశాయి. ‘ఉప్పెన’ ఫేమ్ బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్నది. తాజా షెడ్యూల్ కోసం చిత్రబృందం శ్రీలంకకు పయనమైంది. అక్కడ ఓ పాటతో పాటు కొన్ని కీలక ఘట్టాలను తెరకెక్కించబోతున్నారు. ఈ చిత్రంలో రామ్‌చరణ్ ఆటకూలీగా పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నారు. ఆయన సరసన జాన్వీకపూర్ సందడి చేయనుంది. ఏ.ఆర్.రెహమాన్ సంగీతం ఈ చిత్రానికి ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. శివరాజ్‌కుమార్, జగపతిబాబు, దివ్యేందు శర్మ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి నిర్మాణం: వృద్ధి సినిమాస్, సమర్పణ: మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్, రచన-దర్శకత్వం: బుచ్చిబాబు సానా.

# శక్తిశాలినిగా సైయారా భామ

‘సైయారా’తో బాలీవుడ్‌లో అరంగేట్రం చేసి యువప్రేక్షకుల హృదయాల్ని దోచుకుంది నాజూకు అందాల సోయగం అనీత్ పడ్డా. ఈ సినిమాలో ఆమె అందం, అభినయానికి అందరూ ఫిదా అయ్యారు. ప్రస్తుతం ఈ భామకు బాలీవుడ్‌లో భారీ అవకాశాలొస్తున్నాయి. తాజాగా ఈ సొగసరి మాడాక్ ఫిల్మ్స్‌లోని హారర్ కామెడీ యూనివర్స్‌లో భాగం కాబోతున్నది. ఇప్పటికే ఈ ప్రొడక్షన్ హౌస్ స్త్రీ, రూహీ, భేడియా,థామా వంటి హారర్ కామెడీ చిత్రాలతో హిందీ చిత్రసీమలో ప్రత్యేకతను చాటుకుంటున్నది. మాడాక్ ఫిల్మ్స్ నిర్మించనున్న తదుపరి చిత్రం ‘శక్తిశాలిని’లో అనీత్ పడ్డా టైటిల్ రోల్‌ని పోషించనుంది. ఈ విషయాన్ని చిత్రబృందం అధికారికంగా వెల్లడించింది. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన ప్రీప్రొడక్షన్ వర్క్ జరుగుతున్నది. ‘సైయారా’ వంటి హృద్యమైన ప్రేమకథా చిత్రం తర్వాత అనీత్ పడ్డా ప్రతిష్టాత్మక హారర్ ఫ్రాంఛైజీలో ఛాన్స్ దక్కించుకోవడం ఆమె కెరీర్‌లో కీలకమైన మలుపు అని బాలీవుడ్ ట్రేడ్ వర్గాలంటున్నాయి. తొలుత ఈ చిత్రంలో కియారా అద్వాణీని నాయికగా అనుకున్నారు. డేట్స్ సమస్య వల్ల ఆమె అందుబాటులో లేకపోవడంతో చివరకు బాలీవుడ్ లేటెస్ట్ యూత్ సెన్సేషన్ అనీత్ పడ్డాను ఖరారు చేసింది చిత్రబృందం.

